క్లుప్తంగా

సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువకావాలి


అధికారులతో మాట్లాడుతున్న సత్యనారాయణ

సరుబుజ్జిలి: ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరినప్పుడే మంచి ఫలితాలు వస్తాయని మండల ప్రత్యేకాహ్వానితుడు కిల్లి వెంకటగోపాల సత్యనారాయణ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమం అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించారు. పథకాల పంపిణీలో ఎటువంటి అక్రమాలు జరిగినా కఠిన చర్యలు ఉంటాయని స్పష్టంచేశారు. ఎంపీడీఓ పీవీ మురళీమోహన్‌కుమార్, ఈఓపీఆర్డీ ఆనందరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు అత్తులూరి రవికాంత్, తవిటినాయుడు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన


విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పొందూరు: మండలంలోని పిల్లలవలస జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి హాండ్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచారు. శ్రీసత్యసాయి జిల్లాలోని కదిరిలో ఇటీవల జరిగిన పోటీల్లో శ్రీకాకుళం జిల్లా బాలికలు రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచారు. ఆ జట్టులో పిల్లవలస విద్యార్థులు గురుగుబెల్లి లాస్య, గురుగుబెల్లి సుస్మిత, వావిలపల్లి దివ్య, గురుగుబెల్లి అఖిల ఉన్నారు. ఈ పోటీల్లో మంచి ప్రతిభను కనబరచడంతో హెచ్‌ఎం కాసులు బాబు, పీడీ గురుగుబెల్లి రాజశేఖరరావు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

సంత ఏర్పాటుకు అవకాశం ఇవ్వాలి


కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న సర్పంచ్ రామారావు

మెళియాపుట్టి: మండలంలోని చాపర గ్రామంలో వారపు సంత నిర్వహించడానికి అవకాశం కల్పించాలని కలెక్టర్‌ను సర్పంచ్ బోసి రామారావు కోరారు. సోమవారం శ్రీకాకుళంలో నిర్వహించిన స్పందనలో కలెక్టర్‌ను కలిసి వినతిపత్రాన్ని అందించారు. కొన్నేళ్ల క్రితం చాపరలో సంత నిర్వహించేవారమని, ప్రస్తుతం జరగడం లేదన్నారు. మండలంలోనే పెద్ద గ్రామ పంచాయతీ అయిన చాపరలో సంత నిర్వహిస్తే చిరువ్యాపారులకు ఉపాధి లభిస్తుందని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.

వినతి..


పీఓ నవ్యకు వినతిపత్రం అందజేస్తున్న గిరిజన నాయకులు

మెళియాపుట్టి: గిరిజనేతరులకు 2017లో సీఆర్టీలుగా కొలువులు కల్పించడం వల్ల గిరిజన నిరుద్యోగ యువత నష్టపోయారని ఆదివాసీ సేన రాష్ట్ర కార్యదర్శి వరహాల కృష్ణారావు అన్నారు. సోమవారం ఐటీడీఏ పీఓ బండి నవ్యను సీతంపేటలో కలిసి వినతిపత్రం అందించారు. 2017లో 138 మంది ఉపాధ్యాయులను అప్పటి పీఓ శివశంకర్ నియమించారని, జీఓ 51 ప్రకారం నియామకం చేపట్టాల్సి ఉన్నా అలా చేయలేదన్నారు. అప్పట్లో దీనిపై ప్రశ్నించిన గిరిజన యువతపై కేసులు పెట్టారని పీఓ దృష్టికి తీసుకెళ్లారు. చైతన్యవేదిక జిల్లా అధ్యక్షుడు సవర చొక్కారావు ఉన్నారు.

క్రీడాస్ఫూర్తి అవసరం


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న నిర్వాహకులు

నరసన్నపేట: ప్రతి ఒక్కరిలో క్రీడాస్ఫూర్తి ఉండాలని, ఆటల్లో గెలుపోటములు సహజమని వైఎస్సార్‌సీపీ నాయకుడు మచ్చు గణేష్ అన్నారు. మండలంలోని తామారాపల్లిలో పార్టీ కార్యకర్త కొండాల కొండలరావు జ్ఞాపకార్థం నియోజకవర్గ స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను సోమవారం ప్రారంభించారు. క్రమశిక్షణగా పోటీలు నిర్వహించాలని నిర్వాహకులను కోరారు. ఈ టోర్నీలో 40 జట్లు పాల్గొనున్నాయి. 13 రోజులపాటు పోటీలు నిర్వహిస్తారు. టోర్నీ విజేతకు రూ.25 వేలు, రెండో స్థానంలో ఉన్న జట్టుకు రూ.12,500 నగదు పారితోషికంగా ఇస్తామని నిర్వాహకులు తెలిపారు. పంచాయతీ ఉప సర్పంచ్ కోల గణేష్, చింతు మోహన్, బైరి చిన్నవాడు, గొద్దు జగన్మోహనరావు, బైరి తవిటయ్య తదితరులు పాల్గొన్నారు.


పాతపట్నం: మార్కెట్ యార్డు ఎదురుగా ఉన్న వేంకటేశ్వర ఆలయంలో క్యూలో ఉన్న భక్తులు


సరుబుజ్జిలి: రొట్టవలస వేంకటేశ్వర ఆలయంలో స్వామివారి శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు


నరసన్నపేట: మండల కేంద్రంలోని వేంకటేశ్వరాలయంలో బారులు తీరిన భక్తులు


ఎల్.ఎన్.పేట: తురకపేట సెంటర్ వద్ద ఉన్న వేంకటేశ్వరాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

వైభవంగా ముక్కోటి ఏకాదశి

- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు
- భక్తిశ్రద్ధలతో పూజలు

ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఆమదాలవలస, నరసన్నపేట, పాతపట్నం నియోజకవర్గాల్లోని వేంకటేశ్వర ఆలయాల్లో భక్తులు సోమవారం ప్రత్యేక పూజలు చేపట్టి ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నారు. వేకువ జాము నుంచే ఆలయాల వద్ద భక్తులు బారులు తీరారు. ఆలయాలన్నీ గోవింద నామస్మరణతో మార్మోగాయి. నరసన్నపేటలోని వేంకటేశ్వరాలయంలో ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ ప్రత్యేక పూజలు చేశారు. – సాక్షి నెట్‌వర్క్


కొత్తూరు: నృత్యం చేస్తున్న కొత్తూరు కోలాట బృందం


నరసన్నపేట: కొల్లవానిపేట ఉమారుద్రకోటేశ్వర ఆలయంలో గీతాలు ఆలపిస్తున్న విశాఖపట్నానికి చెందిన భజన బృందం


కొత్తూరు: వేంకటేశ్వరాయలం నుంచి జ్యోతిలతో తిరువీధి నిర్వహిస్తున్న భక్తులు


సారవకోట: వేంకటేశ్వర స్వామిని దర్శించుకుంటున్న వైఎస్సార్‌సీపీ సీఈసీ మెంబర్ ధర్మాన పద్మప్రియ


నరసన్నపేట: మండల కేంద్రంలోని వేంకటేశ్వరాలయంలో పూజలు ఆలయ కమిటీ ట్రస్టీ చైర్మన్ విరభద్రస్వామి, ఈఓ కేశవరావు


సారవకోట: కొత్తూరులోని అభయాంజనేయ స్వామి ఆలయంలో దీపారాధన చేసిన భక్తులు


నరసన్నపేట: మండల కేంద్రంలోని వేంకటేశ్వరాయలంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్


హిరమండలం: మండల కేంద్రంలో రమాసత్యనారాయణ స్వామి ఉత్సవ విగ్రహం ఊరేగింపులో కోలాట దృశ్యం

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం


లబ్ధిదారులకు అభివాదం చేస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

- అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాల వర్తింపు
- గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో స్పీకర్ తమ్మినేని సీతారాం

బూర్జ: సీఎంగా వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన నాటి నుంచి రాష్ట్రం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. బూర్జ మండల కేంద్రంలో సోమవారం రెండో రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా, లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందకపోతే గ్రామ సచివాలయాన్ని సంప్రదించాలన్నారు. గ్రామంలోని తాగునీటి సమస్య పరిష్కరించాలని, డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాలని స్పీకర్‌ను పలువురు కోరారు. గత ప్రభుత్వంలో నిర్మించిన ఇళ్లకు బిల్లులు మంజూరు కాలేదని, ఆ బిల్లులు మంజూరు చేయాలని స్పీకర్ దృష్టికి తీసుకువచ్చారు. సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరలోనే పరిష్కరిస్తామన్నారు.

బూర్జ గ్రామానికి ఇంటింటికీ మంచినీటి కుళాయిల నిమిత్తం జల్ జీవన్ పథకంలో భాగంగా ప్రభుత్వం రూ.1.23 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు స్పీకర్ తెలియజేశారు. రానున్న ఎన్నికల్లో సీఎం జగన్‌కు మద్దతుగా నిలవాలని కోరారు. జెడ్పీటీసీ బెజ్జిపురపు రామారావు, మండల ప్రత్యేక ఆహ్వానితుడు కర్నేన నాగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ మండల కమిటీ అధ్యక్షుడు ఖండాపు గోవిందరావు, స్థానిక సర్పంచ్ అనురాధ, వైస్‌ఎంపీపీలు కరణం కృష్ణమూర్తినాయుడు, బుడుమూరు సూర్యారావు, డీసీఎంఎస్ డైరెక్టర్ జల్లు బలరాంనాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు బగాది నారాయణమూర్తి, మండల ప్రధాన కార్యదర్శి ఇసాయి వెంకటరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఉరజాంలో గడపగడపకు మన ప్రభుత్వం

పోలాకి: మండలంలోని ఉరజాం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఈశ్వరరావు సోమవారం తెలిపారు. నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరవుతారన్నారు. సచివాలయం ఆవరణలో నూతన ఫించన్లు పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొంటారన్నారు.

నేడు కురిగాంలో..

కొత్తూరు: మండలంలోని కురిగాం సచివాలయం పరిధి కురిగాం, మహదేవిపురం గ్రామాల్లో మంగళవారం సాయంత్రం నాలుగు గంటల నుంచి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే రెడ్డి శాంతి నిర్వహించనున్నారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు గండివలస ఆనందరావు సోమవారం తెలిపారు. పార్టీ శ్రేణులు హాజరుకావాలని కోరారు.

నాడు-నేడు పనుల పరిశీలన

సారవకోట: మండల కేంద్రంలోని కేజీబీవీలో నాడు-నేడు నిధులతో నిర్మిస్తున్న అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. సోమవారం చేపట్టిన స్లాబ్ నిర్మాణ పనులను మండల ఇంజినీర్ కోదండరావు, ఎంఈఓ ఎం.వి.రమణల సమక్షంలో చేపట్టారు. ప్రస్తుతం ఇక్కడి ఇంటర్మీడియెట్ తరగతులు కూడా జరుగుతుండటంతో నిర్మాణ పనులు వేగవంతంగా చేపడుతున్నారు. కేజీబీవీ సిబ్బందికి అధికారులు పలు సూచనలు చేశారు.


స్లాబ్ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న అధికారులు

361 పింఛన్లు మంజూరు


మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ ప్రదీప్

పాతపట్నం: మండలంలోని 18 గ్రామ పంచాయతీ పరిధిలోని 361 వైఎస్సార్ పింఛన్లు కొత్తగా మంజూరయ్యాయని వైస్ ఎంపీపీ సవిరిగాన ప్రదీప్ అన్నారు. పాతపట్నంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. మండలంలోని 10 మంది డప్పుకళాకారులకు, 34 మంది దివ్యాంగులకు, ముగ్గురు మత్స్యకారులకు, 158 మంది వృద్ధులకు, ముగ్గురు ఒంటరి మహిళలకు, ఒకరు దేవాంగులు, 144 మంది వీడోలకు ఫించన్లు మంజూరయ్యాయన్నారు. ఈ నెల 3వ తేదీ సాయంత్రం 3 గంటలకు కోర్టు కూడలిలోని వ్యవసాయశాఖ కార్యాలయం వద్ద నూతన పింఛన్‌లను ఎమ్మెల్యే రెడ్డి శాంతి పంపిణీ చేస్తారన్నారు. నూలు ఈశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు పనుకుమోహన్, జి.రాము, పి.తిరుపతిరావు, ఎస్.కృష్ణారావు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నూతన అధ్యాయం


పోలాకి: ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

- ట్యాబ్‌ల పంపిణీలో ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

పోలాకి: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయాలతో రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో నూతన అధ్యాయం ప్రారంభమైందని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. సోమవారం ఈదులవలస ఏపీ మోడల్ స్కూల్‌లో 100 మంది విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం పుస్తకాల పంపిణీ మాత్రమే చేపట్టి, కార్పొరేట్ పాఠశాలల బలోపేతానికి అవకాశం కల్పించాయని విమర్శించారు. దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి హయాంలో మోడల్‌స్కూల్ వ్యవస్థ వచ్చిందన్నారు. ప్రిన్సిపాల్ పైడి ప్రవీణ అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, మండల పరిషత్ సలహాదారు ముద్దాడ బైరాగినాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు కణితి కృష్ణారావు, ముద్దాడ మురళీనాయుడు పాల్గొన్నారు.

బూర్జ: మండలంలోని కొల్లివలస గ్రామంలో గల డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకులం బాలుర విద్యాలయంలో 8వ తరగతి విద్యార్థులకు ఎంపీపీ కర్నేన దీప సోమవారం ట్యాబ్‌లు పంపిణీ చేశారు. జెడ్పీటీసీ బెజ్జి పురపు రామారావు, వైస్ ఎంపీపీ బుడుమూరు సూర్యారావు, ప్రిన్సిపాల్ నూక రామకృష్ణ, చీడివలస సర్పంచ్ బూరి శ్రీరామమూర్తి, వైఎస్సార్‌సీపీ నాయకులు జీడి వేణు, ఎన్.త్రినాథరావు, కొండలరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


బూర్జ: ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు

గ్రామ సభల్లో ప్రజల భాగస్వామ్యం పెరగాలి


నరసన్నపేట: మాట్లాడుతున్న సర్పంచ్ శంకర్

నరసన్నపేట: ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న గ్రామ సభలకు పంచాయతీ పరిధిలో ఉన్న ప్రజలు హాజరుకావాలని, వారి సమస్యలు తెలియజేయాలని నరసన్నపేట సర్పంచ్ బూరెల్ల శంకర్ విజ్ఞప్తి చేశారు. సోమవారం నిర్వహించిన గ్రామ సభకు ప్రజల భాగస్వామ్యం తక్కువగా ఉందన్నారు. గ్రామ సభలో పంచాయతీ నిధులు, ఖర్చులు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ఈఓ సింహాద్రి వివరించారు. ఉపాధి, గృహ నిర్మాణం, పాఠశాలల పనితీరు, అంగన్‌వాడీ కేంద్రాల పనితీరుపై సమీక్షించారు. 2022 ఏప్రిల్ నాటికి రూ.93 లక్షలు పంచాయతీలో నిల్వ ఉండగా.. ఆ నెల నుంచి డిసెంబర్ వరకు వివిధ పద్దుల కింద మరో రూ.1,06 కోట్లు ఆదాయం వచ్చిందన్నారు. ఈ 9 నెలల్లో రూ.1,67 కోట్లు ఖర్చు చేయగా.. అంత్య నిల్వ రూ.32 లక్షలు ఉందన్నారు. ఉప సర్పంచ్ ఎస్.కృష్ణబాబు, వార్డు సభ్యులు నీలం రాజు, బి.ఎల్.శర్మ, ఆర్.శ్రీధర్, ఎంపీటీసీ కేశవరాజు, కో–ఆప్షన్ సభ్యుడు రమణసాహు పాల్గొన్నారు.

గ్రామ సభల్లోనే సమస్యల గుర్తింపు

ఎల్.ఎన్.పేట: గ్రామ సభల్లోనే సమస్యలు గుర్తించటం జరుగుతుందని ఈఓపీఆర్డీ జి.శ్యామలాదేవి అన్నారు. ముంగెన్నపాడు, గొట్టిపల్లి, బొర్రంపేట పంచాయతీల్లో సోమవారం సర్పంచ్‌ల ఆధ్యక్షతన నిర్వహించిన గ్రామ సభలో మాట్లాడారు. గ్రామానికి అవసరమైన పనులను తీర్మానం చేసి ఆమోదించాలన్నారు. సర్పంచ్‌లు యారబాటి గణపతి, బొడ్డేపల్లి రమణమ్మ, ఎంపీటీసీ కింతలి చిరంజీవి, మాజీ ఎంపీపీ శిమ్మ సాంబశివరావు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, వార్డు సభ్యులు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పింఛన్ పెంపుతో భరోసా

జలుమూరు: పెరిగిన పింఛన్లతో పలువురి లబ్ధిదారుల జీవితాలకు ఎంతో భరోసా కలగనుందని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. చల్లవానిపేటలోని ఓ ప్రైవేట్ కల్యాణ మండపంలో సోమవారం పింఛన్లను పంపిణీ చేశారు. పింఛన్ మొత్తం రూ.2,500 నుంచి రూ.2,750 పెంచడంతో కృతజ్ఞతగా సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఎంపీపీ వాన గోపి, వైస్‌ఎంపీపీ తంగి మురళీకృష్ణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎం.శ్యామలరావు, అల్లాడ, చల్లవానిపేట పీఏసీఎస్ అధ్యక్షులు ముసలినాయుడు, రాజాపు్పల నాయుడు, స్థానిక నాయకులు పి.విజయ్, మండల సలహాదారు పైడి విఠలరావు, బి.లక్ష్మణరావు, దామ మన్మధరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

కొత్తూరు: మండల కేంద్రంలో వైఎస్సార్ పింఛన్లను వైస్ ఎంపీపీ లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు సోమవారం పంపిణీ చేశారు. గ్రామ వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఎల్.ఎన్.పేట: గొట్టిపల్లి గ్రామంలో వైఎస్సార్ భరోసా పింఛన్లను మాజీ ఎంపీపీ శిమ్మ సాంబశివరావు సోమవారం పంపిణీ చేశారు. సర్పంచ్ వాన తవిటయ్య, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

బూర్జ: లక్కుపురంలో ఎంపీపీ కర్నేన దీప, డొంకలపర్తలో జెడ్పీటీసీ బెజ్జిపురపు రామారావు, మదనాపురంలో వైఎస్సార్‌సీపీ మండల కమిటీ అధ్యక్షుడు ఖండాపు గోవిందరావు సోమవారం పింఛన్లు పంపిణీ చేశారు. ఆయా గ్రామ వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.


జలుమూరు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, లబ్ధిదారులు


ఎల్.ఎన్.పేట: పింఛన్లు పంపిణీ చేస్తున్న మాజీ ఎంపీపీ సాంబశివరావు


బూర్జ: లక్కుపురంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ కర్నేన దీప


కొత్తూరు: పింఛన్లు పంపిణీ చేస్తున్న వైస్ ఎంపీపీ తులసీవరప్రసాదరావు

బోరుబావి స్థలం ఆక్రమణపై ఫిర్యాదు

నరసన్నపేట: స్థానిక హడ్కో కాలనీలోని బోరుబావి స్థలం ఆక్రమణను అడ్డుకోవాలని రెవెన్యూ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ హేమసుందర్, పంచాయతీ కార్యాలయంలో ఈఓ సింహాద్రికి స్థానికులు ఫిర్యాదు చేశారు. కాలనీ వాసులు ఉపయోగిస్తున్న బోరుబావిని తొలగించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు.

4, 5 తేదీల్లో మహిళా కబడ్డీ టోర్నీ

పాతపట్నం: స్థానిక మార్కెట్ యార్డు ఆవరణలో నార్వల్ కబడ్డీ, స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 4, 5 తేదీల్లో మహిళా కబడ్డీ టోర్నమెంట్ నిర్వహించనున్నారు. ఈ మేరకు టోర్నమెంట్ నిర్వాహకులు బి.సింహాచలం సోమవారం తెలిపారు. మ్యాట్‌పై కబడ్డీ ఆడనున్నారని, ఎంట్రీ ఫీజు లేదన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ 87904 68198 నంబర్‌ను సంప్రదించాలన్నారు.